క్లుప్తంగా

ఘనంగా త్యాగరాజస్వామి ఆరాధనోత్సవాలు



తెనాలి: పట్టణంలోని శ్రీలక్ష్మీ శారద సంగీతాలయం ఆధ్వర్యంలో ఆదివారం శ్రీత్యాగరాజస్వామి ఆరాధన ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. స్థానిక నాజరుపేటలోని శ్రీలక్ష్మీ నృసింహస్వామి దేవస్థానంలో త్యాగరాజస్వామి పంచరత్న కీర్తనలు, ఉత్సవ సంప్రదాయ సేవను జరిపారు. ఉదయం 8 గంటలకు రామలింగేశ్వరపేటలోని సంగీత గురువు నివాసం నుంచి నగర సంకీర్తనగా బయలుదేరి ఆలయానికి చేరుకున్నారు. అక్కడ సద్గురు త్యాగరాజస్వామి విరచిత ఘన రాగ పంచరత్న కీర్తనలను ఆలపించారు. తదుపరి చిన్నారులు త్యాగరాజ కీర్తనలను ఆలపించారు. త్యాగరాజస్వామి ఆరాధన ఉత్సవాలను గత 31 ఏళ్లుగా నిర్వహిస్తున్నట్లు ఆంజనేయశాస్త్రి తెలిపారు.సభ్యులు కొండపి శ్రీనివాసరావు, కేశవరావు, అందె బాలచంద్రమౌళి పర్యవేక్షించారు.

పేదలకు నూతన వస్త్రాలు అందజేత



తెనాలి: పట్టణ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఆదివారం పేదలకు నూతన వస్త్రాలను పంపిణీ చేశారు. స్థానిక బోసురోడ్డులోని శ్రీవాసవీ కన్యకా పరమేశ్వరి దేవస్థానంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వాసవీ వనిత ఇంటర్నేషనల్ ప్రెసిడెంట్, క్లబ్ మాజీ గవర్నర్ కోవెళ్లమూడి కల్యాణి ముఖ్య అతిథిగా పాల్గొని పేదలకు వస్త్రాలను పంపిణీ చేశారు. వాసవీ అమ్మవారి ఆత్మార్పణ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఇలాంటి సేవలను నిర్వహించటం ముదావహమన్నారు. ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు అచ్యుత సాంబశివరావు, కార్యదర్శి భాస్కరుని ప్రసాద్, కోశాధికారి ఎంఎస్ఆర్ గుప్త, ఆర్యవైశ్య అపర కర్మశాల అధ్యక్షుడు పొన్నూరు శ్యామలరావు, దేసు శ్రీనివాసరావు, మాలేపాటి తిరుమలేశ్వరరావు, గుండా రామకోటేశ్వరరావు, గుండా పిచ్చయ్య, శ్రీధర్ పాల్గొన్నారు.

కుటుంబీకుల ఆత్మీయ కలయిక



తెనాలిరూరల్: బిట్రా వారి కుటుంబీకులతో తెనాలి గౌతమ్ గ్రాండ్ సందడిగా మారింది. ఒక వేదికగా కుటుంబ సభ్యులు కలిసి కష్టసుఖాలు పంచుకోవడం ఆనందంగా ఉందని నిర్వాహకుడు భువనేశ్వరప్రసాద్ పేర్కొన్నారు. ఆదివారం స్థానిక గౌతమ్ గ్రాండ్ లో బిట్రావారి ఆత్మీయుల కలయిక వేడుకగా కొనసాగింది. ఈ కార్యక్రమంలో బిట్రావారి వంశీయులు పాల్గొన్నారు.

ముస్లిం మైనార్టీలపై టీడీపీది కపట ప్రేమ

తాడేపల్లిరూరల్ : ముస్లిం మైనార్టీలపై తెలుగుదేశం పార్టీ కపట ప్రేమ చూపిస్తోందని వైఎస్సార్ సీపీ మైనార్టీ విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ సుభాని విమర్శించారు. ఆదివారం దుగ్గిరాల గ్రామంలోని ముర్తుజానగర్‌లో విలేకరులతో ఆయన మాట్లాడారు. బీజేపీతో పొత్తు కోసం చంద్రబాబు నాయుడు తహతహ లాడడం అవకాశవాద రాజకీయాలకు నిదర్శనమన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో 2198 మసీదులు ఉన్నాయని, ఒక్కో మసీదులోని మౌజన్, ఇమామ్‌లకు ఏటా రూ.1.98 లక్షలు గౌరవ వేతనం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇస్తున్నారని తెలిపారు. రాష్ట్రంలోని ముస్లిం మైనార్టీలు వైఎస్ జగన్ వెంటే ఉంటారని స్పష్టం చేశారు.

కళ్లజోళ్లు పంపిణీ



తాడేపల్లిరూరల్ : మంగళగిరి పట్టణ పరిధిలోని రామనాథం చిన్నకోటయ్య శివపార్వతమ్మ వృద్ధుల సేవా ఆశ్రమంలో ఆదివారం 105వ నేత్ర పరీక్ష శిబిరం నిర్వహించారు. ఆశ్రమ నిర్వాహకులు రామనాథం వెంకటేశ్వరరావు మాట్లాడుతూ నేత్ర పరీక్షలు ఉచితంగా చేశామని, 50 మందికి ఉచితంగా కళ్లజోళ్లు అందజేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం గుంటూరు జిల్లా అధ్యక్షుడు పారేపల్లి మహేష్, బీసీ సంక్షేమ సంఘం మంగళగిరి నియోజకవర్గ అధ్యక్షుడు తిరువీధుల కిరణ్, విజయ చారిటబుల్ ట్రస్ట్ ఫౌండర్ కాగితల స్వాతి, రవితేజ ట్రేడర్స్ అధినేత విట్టంశెట్టి నాగ కోటేశ్వరరావు, పిరమిడ్ మాస్టర్ దీపాల సాంబశివరావు పాల్గొన్నారు.

దేశం గర్వించదగిన మహానేత పీవీ

ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్



అన్నదానం చేస్తున్న ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్

తెనాలి: భారత తొలి తెలుగు ప్రధాని పీవీ నరసింహారావు దేశం గర్వించదగిన మహనీయుడని ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ అన్నారు. కేంద్ర ప్రభుత్వం ఆయనకు భారతరత్నను ప్రకటించటం అభినందనీయమని పేర్కొన్నారు. మాజీ ప్రధాని పీవీ నరసింహారావుకు భారతరత్న ప్రకటించిన సందర్భంగా తెనాలి బ్రాహ్మణ పరిషత్ ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం బోసురోడ్డులోని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పేదలకు అన్నదానం చేశారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే శివకుమార్ మాట్లాడుతూ భారత తొలి తెలుగు ప్రధానిగా, బహు భాషా కోవిదుడిగా పీవీ నరసింహారావు అందించిన సేవలు అమూల్యమైనవని అన్నారు. తన మేధస్సుతో దేశ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేశారని చెప్పారు. భారతదేశ స్థాయిని పెంచిన నరసింహారావుకు భారతరత్న ప్రకటించాలని బ్రాహ్మణ పరిషత్ ఎంతోకాలంగా కోరుతోందని, ఇంతకాలానికి ఆ కోరిక నెరవేరిందన్నారు. బ్రాహ్మణ పరిషత్ ప్రధాన కార్యదర్శి పోతావఝుల పురుషోత్తమశర్మ, అధ్యక్షుడు పరాశరం వెంకట రామగోపాల్, ఎస్ఆర్‌కే శర్మ, కఠారి హరీష్, షేక్ మీరావలి తదితరులు పాల్గొన్నారు.

బాధితులకు నష్ట పరిహారం చెల్లించాలి



సమావేశంలో మాట్లాడుతున్న కన్వీనర్ వెంకటేశ్వరరావు

తెనాలిటౌన్: దుగ్గిరాలలోని శుభం మహేశ్వరి కోల్డ్ స్టోరేజీలో గత నెల 29న జరిగిన అగ్ని ప్రమాదంలో నష్టపోయిన పసుపు రైతులకు నష్ట పరిహారం వెంటనే చెల్లించాలని బాధిత పసుపు రైతుల ఐక్యకార్యాచరణ సమితి కన్వీనర్ యార్లగడ్డ వెంకటేశ్వరరావు కోరారు. పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో ఆదివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతులకు నష్టపరిహారం చెల్లించాలని కోరుతూ ఫిబ్రవరి 12న కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహిస్తున్నామని, ధర్నాను విజయవంతం చేయాలని రైతులను కోరారు. కోల్డ్ స్టోరేజీలో పంట నిల్వ చేసుకున్న రైతులకు పూర్తి రక్షణ, పంట నిల్వకు రక్షణ చర్యలు చేపట్టాలన్నారు. అగ్ని ప్రమాదాలు భవిష్యత్‌లో జరగకుండా పటిష్ట వ్యవస్థను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో కౌలు రైతు సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.జమలయ్య, చందు సత్యనారాయణ, లంకిరెడ్డి నాగేశ్వరరెడ్డి, కిషోర్, కోటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

సమతుల్య ఆహారంతో ఆరోగ్య జీవనం



నయూబ్ రసూల్‌కు జ్ఞాపిక బహూకరణ

తెనాలి: సమతుల్య ఆహారంతో ఆరోగ్యంగా జీవించవచ్చని ప్రముఖ పోషకాహార నిపుణుడు నయూబ్ రసూల్ చెప్పారు. వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం కవిరాజ పార్కులోని వీజీకే భవన్‌లో పోషకాహార అవగాహన సదస్సును ఏర్పాటుచేశారు. క్లబ్ అధ్యక్షుడు గుత్తా వెంకటరత్నం అధ్యక్షత వహించారు. నయూబ్ రసూల్ మాట్లాడుతూ ఆరోగ్యంగా, ఆనందంగా జీవించటానికి ప్రొటీన్, కార్బోహైడ్రేట్స్, ఫాటి ఆమ్లాలు, విటమిన్స్, మినరల్స్, నీరు మొదలైనవి ఆహారంలో సమతుల్యంగా ఉండేలా చూసుకోవాలని సోదాహరణంగా వివరించారు. క్లబ్ సభ్యుడు రాపర్ల వెంకటేశ్వర్లు క్లబ్‌కు రూ.25 వేలను విరాళంగా ఇచ్చారు. అతిథి నయూబ్ రసూల్, దాత వెంకటేశ్వర్లును క్లబ్ తరపున సత్కరించారు.

ధర్నాను జయప్రదం చేయండి



మాట్లాడుతున్న యార్లగడ్డ వెంకటేశ్వరరావు

తాడేపల్లిరూరల్ : ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం, పసుపు రైతు సంఘాల ఆధ్వర్యంలో సోమవారం గుంటూరు జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద నిర్వహించనున్న ధర్నాను జయప్రదం చేయాలని పసుపు రైతు సంఘం రాష్ట్ర కన్వీనర్ యార్లగడ్డ వెంకటేశ్వరరావు పిలుపునిచ్చారు. ఆదివారం మంగళగిరి పట్టణ పరిధిలోని శ్రీ వేములపల్లి శ్రీకృష్ణ భవన్‌లో కౌలు రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి పి. జమలయ్య, సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి చిన్ని తిరుపతయ్య అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేశారు. వెంకటేశ్వరరావు మాట్లాడుతూ దుగ్గిరాల కోల్డ్ స్టోరేజీలో అగ్ని ప్రమాదం జరిగి, బాధిత రైతులకు రూ.100 కోట్ల నష్టం వాటిల్లిందన్నారు. ప్రమాదంలో నష్టపోయిన రైతులను రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో రైతు సంఘం సీనియర్ నాయకులు జవ్వాది సాంబశివరావు, గోహర్ జానీ తదితరులు పాల్గొన్నారు.

గణపతి స్వామివారి బ్రహ్మోత్సవాలు ప్రారంభం



ప్రత్యేక అలంకారంలో సిద్ధి బుద్ధి సమేత గణపతి స్వామివారు

వెల్లటూరు(భట్టిప్రోలు): భట్టిప్రోలు మండలం వెల్లటూరు గ్రామంలో కొలువైన సిద్ధి బుద్ధి సమేత గణపతి స్వామివారి బ్రహ్మోత్సవాలు ఆదివారం వేడుకగా ప్రారంభమయ్యాయి. ఉదయం వేద బ్రాహ్మణులు, మేళతాళాలు, కనకతప్పెట్ల మధ్య గ్రామ దేవత కట్లమ్మ అమ్మవారికి చద్ది నైవేద్యాలు సమర్పించారు. రాత్రి 8 గంటలకు మహా గణపతి పూజ నిర్వహించి వైదిక పుణ్యాహవచనము, దీక్షా స్వీకరణ, కంకణ ధారణ, అంకురారోపణ, వాస్తు పూజ, అగ్ని ప్రతిష్ఠాపన తదితర కార్యక్రమాల అనంతరం ధ్వజారోహణం నిర్వహించారు. ఉత్సవాలలో ప్రధాన ఘట్టమైన రథోత్సవం ఈ నెల 15న జరుగనున్నది. దేవస్థాన ధర్మకర్త, విశ్రాంత హైకోర్టు న్యాయవాది తాడికొండ శేషగిరిరావు ఆధ్వర్యంలో ఈ బ్రహోత్సవాలు జరుగుతున్నాయి. స్వామివారి కల్యాణ మహోత్సవాలే వెల్లటూరు తిరునాళ్లగా ప్రసిద్ధి గాంచాయి. ఈ తిరునాళ్ల ప్రారంభమయ్యాకనే చుట్టుపక్కల ప్రాంతాలలో తిరునాళ్ల ఉత్సవాలు జరుగుతాయి. దేవాలయ నిర్మాణానికి పాటుపడిన తాడికొండ వంశీయులు ఏటా క్రమం తప్పకుండా బ్రహ్మోత్సవాలను నిర్వహిస్తున్నారు.

రాణి సత్రానికి నూతన శోభ

ఎంపీ నిధులు రూ.40 లక్షలతో అభివృద్ధి



నూతనంగా నిర్మించిన రాణిసత్రం షాపింగ్ కాంప్లెక్స్

రేపల్లె రూరల్: రాణిసత్రం అంటే రేపల్లె పట్టణంలో తెలియనివారు ఉండరు. బ్రిటీష్ పాలకుల నాటి కాలంలో నిర్మించిన ఈ భవనం కాలక్రమంలో శిథిలావస్థకు చేరింది. శిథిల భవనం తొలగించిన అనంతరం నూతన భవన నిర్మాణానికి నోచుకోని దయనీయ పరిస్థితి నెలకొంది. ఈ ప్రాంతంలో చెట్లు, పుట్టలు పెరిగి అధ్వాన్న స్థితికి వెళ్లింది. 2019 ఎన్నికల అనంతరం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకట రమణారావు నూతన భవన నిర్మాణానికి కృషి చేశారు. తొలివిడతలో భాగంగా రూ.40 లక్షల వ్యయంతో రాణిసత్రం షాపింగ్ కాంప్లెక్స్ నిర్మించారు. మిగిలిన స్థలంలో రాణిసత్రం నిర్మించేందుకు కృషిచేస్తున్నారు. షాపింగ్ కాంప్లెక్స్ ఏర్పాటు అనంతరం ఆ ప్రాంతం నూతన శోభను సంతరించుకుంది.

పంట పశువులార్పణం

తాడేపల్లిరూరల్ : విద్యుత్ మోటారు దొంగలు, పంట పొలాలను నాశనం చేస్తున్న పశువుల మందతో రైతులు లబోదిబో మంటున్నారు. ఆదివారం తెల్లవారుజామున పెనుమాక పంట పొలాలను వెంకటపాలెం, మందడం నుంచి పాడి పశువుల మంద ధ్వంసం చేశాయి. సుబ్బారావు అనే రైతు తన ఎకరం పొలంలోని మొక్క జొన్న పంటను రూ.90 వేలకు విక్రయించాడు. రెండు రోజుల్లో పంటను కోయాల్సి ఉండగా..పశువులు కండెల వరకు 80 శాతం తినేశాయి. ఆ పక్కనే అంజిరెడ్డి అనే కౌలు రైతు ఎకరం అరటితోటలో గెలవేసిన చెట్లను కొమ్ములతో పొడిచి వేయడంతో పూర్తిగా దెబ్బతిన్నాయి. ఇలా సుమారు 30 ఎకరాల్లో పంటను పశువులు నాశనం చేశాయని రైతులు చెప్తున్నారు. పశువులను బంధిస్తే వాటి యజమానులు తమపై దొంగతనం కేసులు పెడుతున్నారని, తాడేపల్లి పోలీస్ స్టేషన్‌లో పలుమార్లు ఫిర్యాదు చేసినా ఎవరూ పట్టించుకోలేదని, పంట చేతికొచ్చే సమయానికి పశువులు ఇలా నాశనం చేస్తే తమ పరిస్థితి ఏమిటని రైతులు ప్రశ్నిస్తున్నారు.

మరకత శివలింగానికి అభిషేకం

ఫిరంగిపురం: వేమవరం గ్రామ శివారులోని కోటి ఒక్క శివలింగాల క్షేత్రంలోని మరకత శివలింగానికి ఆదివారం భక్తులు అభిషేకాలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు శివలింగానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మహాకాళేశ్వరుడికి నిర్వహించిన విశేష పూజల్లో పాల్గొని, తీర్థప్రసాదాలు స్వీకరించారు.

కొలకలూరులో పూరిళ్లు దగ్ధం



తెనాలిటౌన్: రూరల్ మండలం కొలకలూరు గ్రామం మసీదు సమీపంలో షేక్ మగ్బూల్, షేక్ ఇబ్రహీంలకు చెందిన పూరిళ్లు ఆదివారం సాయంత్రం విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో దగ్ధమయ్యాయి. ఒకే ఇంట్లో రెండు కుటుంబాలు నివాసం ఉంటున్నారు. సమీపంలో ఉన్న యువకులు వచ్చి కాలిపోతున్న ఇంట్లో మంటలను ఆర్పివేశారు. ఇంట్లో ఉన్న సుమారు రూ.3 లక్షల నగదు, 10తులాల బంగారం ఇతర వస్తువులు అగ్నికి ఆహుతి అయినట్లు బాధితులు తెలిపారు. ఆ సమయంలో కుటుంబాల వారు ఎవరు లేకపోవడంతో నష్టం భారీగా జరిగింది.

మద్దతు ధర చట్టం కోరుతూ ఆందోళన

తెనాలి: డాక్టర్ స్వామినాథన్ కమిటీ సిఫార్సుల ప్రకారం కేంద్ర ప్రభుత్వం అన్ని పంటలకు మద్దతు ధరల చట్టం తేవాలని కోరుతూ ఫిబ్రవరి 16న జరగనున్న గ్రామీణ బంద్‌లో మహిళా పాడి రైతులు సైతం పాల్గొనాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ములకా శివసాంబిరెడ్డి కోరారు. అయితానగర్‌లో ఆదివారం మహిళా పాడిరైతులతో సమావేశం జరిపారు. శివసాంబిరెడ్డి మాట్లాడుతూ పశుగ్రాసం, తవుడు, దాణా ఖర్చులు పెరగటంతో పశుపోషణ భారంగా మారిందన్నారు. పశువుల చావడి నిర్మాణానికి రూ.1.60 లక్షల హామీలేని రుణం ఇచ్చే అవకాశం ఉన్నప్పటికీ బ్యాంకర్లు ఇవ్వకపోవటం అన్యాయమన్నారు. రైతుల రుణాలు మాఫీ చేయాలనీ, కేరళ తరహాలో రుణ ఉపశమన చట్టం తేవాలనీ, ఆహార భద్రత చట్టాన్ని పటిష్ట పరచాలని కోరుతూ ఈనెల 16న గ్రామీణ బంద్ నిర్వహిస్తున్నట్లు వివరించారు. సంఘ సభ్యులు కూచిపూడి శకుంతల, మేకల రజని, అత్తోట సరోజిని, సుశీల, ఈపూరు బేబీరాణి, కమలమ్మ, ధనమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఆర్య ప్రతినిధి సభ కమిటీ ఏర్పాటు

తెనాలిటౌన్: రూరల్ మండలం కొలకలూరులోని మహర్షి దయానంద సరస్వతీ ఆశ్రమంలో శనివారం ఆర్య ప్రతినిధి సభ ఏర్పాటు చేశారు. సభలో ఆంధ్రప్రదేశ్ నూతన కమిటీని ఆచార్య హరిప్రసాద్ ప్రకటించారు. కమిటీ రాష్ట్ర అధ్యక్షుడుగా కోనరాజు రవీంద్ర, సెక్రటరీగా కూరపాటి రవీంద్రనాథ్, వైస్‌ప్రెసిడెంట్‌గా గుర్రం నిర్మల, జాయింట్ సెక్రటరీగా కనగాల రవికుమార్, ఎగ్జిక్యూటివ్ మెంబర్స్‌గా సువర్ణవాణి, రవీంద్రనాథ్ రెడ్డి, సత్యప్రకాష్, కూరపాటి సుధీర్ దయానంద్‌లను నియమించినట్లు ఆయన ప్రకటించారు.

లూథరన్ చర్చి అభివృద్ధికి ఆర్థిక సాయం

జంపని(వేమూరు): లూథరన్ చర్చి అభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలని ఆంధ్రా లూథరన్ సంఘం సెక్రటరీ చిన్నం కిషోర్ కోరారు. వేమూరు మండలంలోని జంపని గ్రామంలో లూథరన్ చర్చి రెండవ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గ్రేస్ ఫౌండేషన్ అధినేత షాలేం రాజు పాల్గొన్నారు. చర్చి అభివృద్ధికి రూ. 20 వేలు ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో బిషప్ కె రత్న మోహన్, సంఘ పాస్టరు పి విజయకుమార్, సంఘస్తులు తదితరులు పాల్గొన్నారు.

విద్యను నిర్లక్ష్యం చేస్తే భవిష్యత్తు శూన్యం

జిల్లా ప్రజా రవాణా అధికారి రవికాంత్



తాడేపల్లిరూరల్ : విద్యను నిర్లక్ష్యం చేస్తే భవిష్యత్తు శూన్యమని జిల్లా ప్రజా రవాణా అధికారి రవికాంత్ అన్నారు. ఆదివారం చిన కాకాని షైన్ ఆనంద శరణాలయాన్ని ఆయన సతీసమేతంగా సందర్శించారు. ఈ సందర్భంగా రవికాంత్ మాట్లాడుతూ విద్యార్థులు గురువులను, పెద్దలను గౌరవిస్తూ క్రమశిక్షణతో విద్యాభ్యాసం కొనసాగించాలన్నారు. బాలబాలికలకు పండ్లు, స్వీట్లు అందజేశారు. శరణాలయానికి రూ.10వేలు ఆర్థిక సాయం అందజేశారు. రవికాంత్ దంపతులను శరణాలయం నిర్వాహకులు ఘనంగా సత్కరించారు. గుంటూరు–1 డిపో సూపరింటెండెంట్ బి. బాలునాయక్, షైన్ ఫౌండేషన్ చైర్మన్ డీజీ నాయక్, నిర్వాహకులు సంధ్యారాణి, పి. సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన దయానంద సరస్వతి ద్విశతాబ్ది జయంతి ఉత్సవాలు

ఉత్సవాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే శివకుమార్



విద్యార్థులకు ప్యాడ్స్ అందజేస్తున్న ఎమ్మెల్యే శివకుమార్

తెనాలిటౌన్: రూరల్ మండలం నందివెలుగులోని మహర్షి దయానంద వృద్ధాశ్రమంలో జరుగుతున్న ఆర్యసమాజ స్థాపకులు మహర్షి దయానంద సరస్వతి ద్విశతాబ్ది జయంతి ఉత్సవాలు ఆదివారంతో ముగిశాయి.ఉదయం 9గంటలకు సామూహిక యజ్ఞం, పూర్ణాహుతి నిర్వహించారు.108 మంది దంపతులతో హోమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ పాల్గొని ప్రసంగించారు. ఆశ్రమంలో వృద్ధులకు చేస్తున్న సేవలను ఎమ్మెల్యే అభినందించారు. రాయపూడి గురుకుల పాఠశాల విద్యార్థులకు ఎమ్మెల్యే శివకుమార్ ప్యాడ్స్,పెన్నులు అందజేశారు. సుమారు 500 మంది భక్తులు పాల్గొన్నారు. వృద్ధాశ్రమ సంఘం అధ్యక్షులు గుగ్గిలం రామమోహనరావు,సెక్రటరీ కూరపాటి కల్యాణి, కోశాధికారి అన్నవరపు నరసింహారావు, కోట బదరీనాథ్‌గుప్తా తదితరులు పర్యవేక్షించారు.

ప్రభుత్వం అండతో పేదల సొంతింటి కల సాకారం

తెనాలి: ప్రభుత్వం ఇచ్చిన స్థలాల్లో పేదలు ఇళ్లు నిర్మించుకుని ఎంతో సంతోషంగా గృహ ప్రవేశం చేస్తున్నారని ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ అన్నారు. రూరల్ మండలం పెదరావూరులోని జగనన్న కాలనీలో ఇల్లు నిర్మించుకున్న పట్టణానికి చెందిన బండ్లమూడి నాని దంపతుల ఆహ్వానం మేరకు ఆదివారం జరిగిన గృహ ప్రవేశానికి ఎమ్మెల్యే శివకుమార్ హాజరయ్యారు. ప్రభుత్వం ఇచ్చిన సెంటు స్థలంలో డూప్లెక్స్ ఇంటిని నిర్మించుకున్న దంపతులను ఆయన అభినందించారు. ఇంటిస్థలం పట్టా ఇచ్చిన సమయంలో ఇచ్చిన హామీ ప్రకారం గృహప్రవేశానికి వచ్చినట్టు తెలిపారు. వేలాది మందికి తన చేతుల మీదుగా ఇళ్ల స్థలాల పట్టాలను ఇవ్వటం తన అదృష్టమని, ఇందుకు అవకాశం ఇచ్చిన ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

సూపర్‌స్టార్ కృష్ణకు ఘన నివాళులు



కృష్ణ చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న ఆదిశేషగిరిరావు, నాదెండ్ల మనోహర్

తెనాలి: సూపర్‌స్టార్ కృష్ణగా ప్రేక్షకుల హృదయాల్లో చెరగని ముద్ర వేసుకున్న తన సోదరుడు, సినీనటుడు కృష్ణ గ్రామాభివృద్ధిని, ప్రజల శ్రేయస్సును కాంక్షించేవారని సినీ నిర్మాత, పద్మాలయా స్టూడియోస్ అధినేత జి.ఆదిశేషగిరిరావు అన్నారు. సినీ హీరో సూపర్‌స్టార్ కృష్ణ స్వస్థలమైన బుర్రిపాలెంలో కృష్ణ మెమోరియల్ ట్రస్ట్ భవన నిర్మాణానికి ఆదివారం ఉదయం శంకుస్థాపన చేశారు. అనంతరం కుటుంబ సభ్యులు, పద్మాలయా స్టూడియోస్ ఆధ్వర్యంలో గ్రామంలోని కళ్యాణ మండపంలో హీరో కృష్ణ సంస్మరణ సభను నిర్వహించారు. కృష్ణ సోదరుడు ఆదిశేషగిరిరావు మాట్లాడుతూ.. 60 ఏళ్ల కిందట సినిమా అవకాశాల కోసం ఒంటరిగా మద్రాస్ వెళ్లిన కృష్ణ, తెలుగు సినీరంగంలో తారా పథానికి చేరుకున్న వైనాన్ని గుర్తు చేశారు. బుర్రిపాలెం, తెనాలి ప్రాంత వాసులు ఎందరికో ఉపాధిని కల్పించారని చెప్పారు. ఎన్నారైలు ఏ దేశంలో ఉంటున్నా, సొంత గ్రామాలకు రావాలి..గ్రామాలు అభివృద్ధి చెందాలని కోరుకునేవారని చెప్పారు. జనసేన పీఏసీ చైర్మన్ నాదెండ్ల మనోహర్ మాట్లాడుతూ.. సూపర్‌స్టార్ కృష్ణ సోదరులు ఆదర్శంగా ఉంటూ స్వగ్రామంలో మార్పుకు ప్రయత్నం చేస్తుండటం గర్వకారణమన్నారు. సినీ రంగంలో కృష్ణ ఒక పరిశ్రమగా ఎదిగి కొత్త టెక్నాలజీలను తీసుకొచ్చారని చెప్పారు. ఎన్నారై పెమ్మ సాని చంద్రశేఖర్ మాట్లాడుతూ సూపర్‌స్టార్ కృష్ణకు కష్టపడటం మినహా మరేవీ తెలియవన్నారు. బుర్రిపాలెం కీర్తి దేశాంతరాలు దాటిందంటే అందుకు కృష్ణ కారణమన్నారు. మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ రాయపాటి శ్రీనివాస్, న్యాయవాది రాఘవరావు, కృష్ణ అభిమాన సంఘాల నేతలు మాట్లాడారు. డాక్టర్ కోనేరు సుధీర్‌కుమార్, ఘట్టమనేని వరప్రసాద్, ఘట్టమనేని నరసింహారావు, బాబి, పెమ్మ సాని జయప్రకాష్, శాఖమూరి కిశోర్, ఘట్టమనేని శేషగిరిరావు, వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన కృష్ణ అభిమాన సంఘాల నేతలు పాల్గొన్నారు.

పేదలకు ఉచిత వైద్య పరీక్షలు



వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ శివప్రసాద్

తెనాలిటౌన్: పట్టణ రజకపేటలోని రజక ఐలమ్మ పార్క్‌లో వాకర్స్ అసోసియేసన్ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. అమ్మ హాస్పిటల్స్ సౌజన్యంతో ఏర్పాటు చేసిన శిబిరంలో వైద్యులు డాక్టర్ శివప్రసాద్‌బాబు, డాక్టర్ శ్రీవిద్య, డాక్టర్ రాకేష్, డాక్టర్ జశ్వంత్‌లు రోగులకు వైద్య పరీక్షలు చేశారు. షుగర్, రక్త పరీక్షలు, బీపీ, ఎముకల వ్యాధికి సంబంధించిన పరీక్షలతో పాటు పిల్లలకు, స్త్రీలకు వైద్య పరీక్షలు జరిపారు. ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వాకర్స్ అసోసియేసన్ అధ్యక్షులు డాక్టర్ శివప్రసాద్, గౌరవ అధ్యక్షుడు మునిపల్లి ప్రసాద్, ఉపాధ్యక్షులు పులిగుజ్జు అర్జునరావు, సెక్రటరీ వంగర శివనాగేశ్వరరావులు పాల్గొన్నారు.

పేదలకు దోమతెరలు పంపిణీ



దోమతెరలను పంపిణీ చేస్తున్న అంజలి

తెనాలి: రూరల్ మండలం కొలకలూరు గ్రామంలో కొమ్మమూరు కాల్వ గట్టుపై నివసిస్తున్న నిరుపేద యానాది కుటుంబాలకు పట్టణానికి చెందిన ట్రిబల్ ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం దోమతెరలు, బియ్యం పంపిణీ చేశారు. తాత్కాలికంగా ఏర్పాటు చేసుకున్న పూరి గుడిసెల్లో నివాసం ఉంటున్న ఆ కుటుంబాలకు దోమల నుంచి రక్షణ లేదని, దోమకాటుతో మలేరియా, డెంగీ వంటి విషజ్వరాల ప్రమాదం ఉందని ట్రస్ట్ డైరెక్టర్ రావూరి అంజలి చెప్పారు. దోమకాటు నివారణ కోసం తమ వంతు సాయంగా దోమ తెరలను పంపిణీ చేసినట్టు తెలిపారు.

గాయకుడు ఘంటసాలకు నివాళులు



ఘంటసాల విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న సభ్యులు

భట్టిప్రోలు: గాన గంధర్వుడు ఘంటసాల వెంకటేశ్వరరావు పాటలు అజరామరమని పలువురు వక్తలు కొనియాడారు. ఆదివారం భట్టిప్రోలులోని స్ఫూర్తి స్థల్ మినీ ట్యాంక్ బండ్ వద్ద ఘంటసాల వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. వివేకానంద విగ్రహ సాధన కమిటీ ఆధ్వర్యంలో ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో సభ్యులు బండారు శ్రీనివాసరావు, ఆర్ సత్యన్నారాయణ మూర్తి, కె.నాగరమేష్, జంజనం హేమశంకరరావు, తిరువీధుల వెంకటేశ్వర్లు, వంగర ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

అమర గాయకుడు ఘంటసాలకు నివాళులు

బాపట్ల అర్బన్: ఘంటసాల 50వ వర్ధంతి సందర్భంగా ఆదివారం ఆల్ ఇండియా ఘంటసాల చైతన్య వేదిక ప్రాంతీయ శాఖ, యువజన కమిటీ సంయుక్త ఆధ్వర్యంలో బాపట్లలోని ఘంటసాల విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఘంటసాల యువజన కమిటీ అధ్యక్షుడు సుభాష్ చంద్రబోస్ ఆధ్వర్యంలో నివాళుల ర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఘంటసాల పాట అజేయమని ఎల్లప్పుడూ ఆయన పాటలు అందరి హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోతాయన్నారు. ఈ కార్యక్రమంలో ఘంటసాల అభిమానులు బ్రహ్మారెడ్డి, శంకర్, సుభాని, సురేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.